# రీతి

శ్రీ విహారిగారి కథానికల్లో పదాల పరదాల మాటున కొన్ని పదాలు దాక్కుని తమ లోతులు తెలుసుకోమంటాయి. పాఠకుని మేధస్సుకు పరీక్ష పెడతాయి. ఆ పదాల ఆత్మను పట్టుకోగలిగిన పాఠకునికి ఇక కడుపు నిండా కథాక్షీరాన్నమే దొరుకుతుంది.

కథానిక చివరలో అతిసామాన్యమైన ముసలమ్మ పాత్ర ద్వారా తరాల అంతరాల మధ్య జరిగే మానవ స్వభావ మార్పును, ధనప్రలోభంలో ఇగిరిపోయే మానవ సంబంధాలను నారికేళపాకంలో అందించారు. ఒక చిన్నపదంతోనో, ఒక సంకేతంతోనో అటువంటి సంఘర్షణను విశదీకరించేదే నిజమైన కథానికా లక్షణం.

- శిరంశెట్టి కాంతారావు ( పాత పాల్వంచ )

ఉదయం ఏడున్నరయింది!

నేను దినపత్రిక చదువుతున్నాను...

సిటవుట్‌లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది నా భార్య శారద.

మా రెండోకొడుకు వేణు భార్యాపిల్లల్ని తీసుకుని హైదరాబాద్ నుంచి ఈసరికే రావాల్సింది... వాళ్ళ కోసమే ఈ ఎదురుచూపులు.

ఇంతలో భాస్కర్ వచ్చాడు.

అతనితో పాటు తానూ హాల్లో కొచ్చింది శారద. భాస్కర్ నా మేనల్లుడు. వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"సారీ మావయ్యా... మీ పని కాలేదు. ఆఫీస్‌లో చాలా బిజీగా ఉంటోంది. పైగా చిన్న చిన్న పనులకి ఇవ్వాళా, రేపూ ఏ మేస్త్రీ రావడం లేదు. చూస్తాను."

ఇరవై ఏళ్లనాటి పాత ఇల్లు. గోడలు బీటలు వారినై. వానొస్తే కిటికీల్లోంచి వర్షంనీరు... అదీ సమస్య! మేస్త్రీ కోసం నేను తిరగలేను. భాస్కర్‌ని సహాయం అడిగాను. అదీ సంగతి.

కాఫీ తెచ్చింది శారద. అతనికిచ్చి నవ్వుతూ "నీ బిజీ తెలుసులేవయ్యా! ఎలావుంది బిజినెస్!" అడిగింది.

"ఏదో జరిగిపోతోందత్తయ్యా! అందితే జుట్టు, అందకపోతే కాళ్లు... అన్నట్టుంది!"

పెద్ద పబ్లిక్ సెక్టార్ కంపెనీలో ఉద్యోగం భాస్కర్‌కి. అక్కడి ఉద్యోగులకే మంచి రేటుకి అప్పులిస్తూ ఉంటాడు. ఆ వృత్తికి ముద్దుపేరు 'ఫైనాన్స్.' ముప్పై అయిదేళ్లొచ్చినా "పెళ్ళికి తొందర లేదు. నాలుగు రాళ్లు వెనకేసుకున్న తర్వాతే ఆ సంగతి!" అంటాడు.

కాఫీ అయింది. సెల్ మ్రోగింది. లేచాడు–

"ఈ వారంలో తప్పకుండా చూస్తా మావయ్యా!" అంటూ "వస్తా..." అని శారదకూ చెప్పి వెళ్లిపోయాడు.

"ఆ నాలుగురాళ్ల వెంబడి పడి వీళ్ళంతా పరుగో పరుగు. బిజీ... బిజీ..." అని ఫోన్‌కేసి నడిచింది శారద. స్పీకర్ ఆన్ చేసి రింగ్ చేసింది.

"ఎక్కడిదాకా వచ్చార్రా?" అడిగింది. వేణు అన్నమాట. నాకు అర్థమైంది.

అవతలినుంచి మాటలు...

"నిన్న సాయంత్రం... తీరా బయల్దేరేముందు ఆఫీస్‌లో ఏదో దొంగతనం జరిగింది. అంతా అప్‌సెట్ అయింది. చాలా బిజీ. అసలు బయల్దేరలేదు. ఏమీ అనుకోకు. నాన్నగారికీ చెప్పు."

"అదేమిట్రా? పోనీ, రత్నంనీ, పిల్లల్నీ అన్నా పంపకపోయావా?"

"ప్రతి పండక్కీ ఇట్లా ప్రాణం తియ్యకమ్మా... మేము రాలేము. సవాలక్ష పనులు. బిజీ మనుషులం. రత్నంకీ ఈ నెల టార్గెట్ కాలేదు. ఛస్తోంది. పైగా ఇద్దరాడపిల్లలు. పిల్లలతో ఇల్లు కదలాలంటే వేల ఖర్చు. వాళ్ళకి వాళ్ళూ బిజీ!" తీవ్రస్థాయిలోనే ఉంది వేణు విసుగుదల.

ఇంతలో... రత్నం మాట కలిపింది –

"ఉద్యోగాల్లో మా అవస్థలేవో మావి కానీ, మీరేం అనుకోకండత్తయ్యా! పిల్లలకీ యూనిట్ టెస్ట్‌లూ, అవీ ఉన్నయ్. ట్యూషన్లు... ఈసారి వస్తాం లెండి. ఆయన కొంచెం చిరాగ్గా ఉన్నారు. నేను తర్వాత మాట్లాడతాను..." ఫోన్ కట్ చేసింది.

వేణు ప్రైవేట్ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్. రత్నం ఇన్సూరెన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్. ఇద్దరు పిల్లలు. కవలలు. రత్నం చాలా సహనవంతురాలు, పొందికైన మనిషి.

శారద డీలాపడి కూర్చుంది. నావైపు చూసింది.

నేనేమీ చెప్పనని ఆమెకు తెలుసు...

చెప్పినా "వాళ్ళ పనులేవో వాళ్ళకుంటాయి. బిజీ మనుషులు. పోనీలేవే..." అంటాననీ తెలుసు.

ఫోన్ ఉన్న టీపాయ్‌ని తనకు దగ్గరగా జరుపుకుంది. రింగ్ చేసింది.

కూతురు లతకని నాకు తెలుస్తూనే ఉంది.

ఆమె వైజాగ్‌లో ఉంటుంది. టీచర్. భర్త గోపాల్ స్టీల్ ఫ్యాక్టరీలో ఇంజనీర్. సుధ, సుధాకర్ పిల్లలు. ఇద్దరూ ఇంటర్‌లో కొచ్చారు. ఫోన్ తీసినట్లుంది.

"మేం రాలేకపోతున్నామే... మీ అల్లుడుగారికి చాలా బిజీగా ఉంది. నేనూ అంతే! స్కూల్‌లోనే ట్యూషన్లూ- నా బొంద! చచ్చే చావుగా ఉంది. పిల్లలకి ఐఐటి కోచింగ్ ఒకటీ... వాళ్ళకీ ఊపిరాడడం లేదు. ఏమిటో... బతుకంతా చదువూ, సంపాదనా..." తల్లిని ఒక్కమాట మాట్లాడనీయకుండా పది నిమిషాలు తనకు తానే చిరాకు మాటలు చెప్పుకుంది.

నేను వింటున్నాను, చూస్తున్నాను... శారద మొహంమీద నిరుత్సాహం, నిర్వేదం పొడ. కవళికలు త్వరత్వరగా మారిపోతున్నై.

ఫోన్ పెట్టేసింది. "అదేమిటే... నువ్వూ ఇట్టా తయారయ్యావ్..." వంటి కొన్ని మాటలు శారద నోటి నుంచి దొర్లినై. ఆ తర్వాత నావైపు తిరిగి తన ఆత్మఘోషని, అంత:కరణ భాషనీ నాతో పంచుకుంది. నేను మౌనశ్రోతని. ఇదీ ఆమెకు బాధ కలిగించే విషయమే.

ఇక అసలు సమయం ఆసన్నమైంది-

"పెద్దవాడు డాలర్ల వేటలో దేశాలు పట్టుకుపోయాడు. దేశంలో ఉన్న ఇద్దరూ ఇదీ వరస! మీరేమో వాళ్ళకో మాట చెప్పరు. ఓ మాట గట్టిగా అనరు. అంతా నా తాపత్రయమే!" ఇప్పుడిక ఆమె కళ్ళల్లో నీళ్లు!

నా మౌనాన్ని భంగపరచుకుంటూ "సరేకానీ, ఇవన్నీ మనకు మామూలేగా!" అని, "కాఫీ కలుపు... ఇద్దరికీనూ!" అన్నాను.

కొంగుతో కళ్ళొత్తుకుంటూ లేచిందామె.

నాకు మా అల్లుడి మాటలు గుర్తుకొచ్చినై... క్రితంసారి దీపావళి పండక్కి రమ్మని పిలిస్తే "మీకేం సార్... రిటైరయి కూర్చున్నారు. పైగా ఏ తాపత్రయమూ లేని మనుషులు. మోస్ట్ కన్‌టెన్‌టెడ్ సోల్స్! కానీ, మా పరిస్థితి అది కాదు కదా! అవసరాలు, డబ్బు ఆశా రెండూ వున్నవాళ్ళం. అంత తొందరగా కదల్లేము" అన్నాడు. నవ్వుతూ చెప్పినా అతను చెప్పినదాన్లో కొంత నిజం వున్నట్లనిపించింది.

కాఫీగ్లాసులతో వచ్చింది శారద.

మేం కాఫీ పూర్తిచేస్తుండగా రామభద్రయ్య భార్య సరస్వతమ్మ ఫోన్ చేసింది. ఆయనా, నేనూ సహోద్యోగులం. ఒక్కరోజునే రిటైరయ్యాం. ఇవ్వాళ వాళ్ళ యాభయ్యవ వివాహ దినోత్సవం. మధ్యాహ్నం హోటల్లో లంచ్... వెళ్లాలి. ఇప్పుడేం చెప్తుందా... అని ఉత్సుకతతో చూస్తున్నాను శారద వైపు.

శారదతో మాట్లాడుతోందామె...

"ఏమిటో వదినా- పిల్లలిద్దరూ వాళ్ళంతట వాళ్ళు ముచ్చటపడి మా ప్రాణం తీశారీ ఫంక్షన్‌కి. తీరా అందరికీ చెప్పి, అన్ని ఏర్పాట్లూ చేశాక మా కోడళ్ళిద్దరూ రాలేదు. బిజీ అట. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ వాళ్ళు గదా. అబ్బాయి లొచ్చారు. నాకేం బాగా లేదు. ఇప్పుడు పార్టీ కేన్సిల్ చేస్తే నవ్విపోరూ?! అందుకే కళ్ళు మూసుక్కూచోటం. సరేగానీ, కాస్త ముందుగా రా వదినా!" ఆ కంఠస్వరం ఆమె గుండెలో మిగిలిపోయిన అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉంది.

సానునయంగా నాలుగు మాటలు మాట్లాడి, "అలాగే వస్తాం వదినా!" అంటూ పెట్టేసింది శారద.

"ఏం పిల్లలో, ఏమో! ఎవరిని కదిలించినా బిజీ... బిజీ... బిజీనెస్‌తో ఛస్తున్నాం!" అంది నావైపు చూస్తూ.

మరికొద్దిసేపు మా పిల్లల ముచ్చట్లు సాగించింది.

పన్నెండవుతూండగానే నేనూ, శారదా హోటల్ చేరుకున్నాం.

హాల్లో నలుగురైదుగురున్నారు. రామభద్రయ్య, భార్య- వారి ఇద్దరు కొడుకులూ మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు.

ఒంటిగంటయింది.

వచ్చిన పదిమందీ ముందు వరుసల్లో కూర్చున్నారు.

"ఇవ్వాళా, రేపూ అభిమానానికి కొలబద్ద- డబ్బే! ఆ డబ్బేమో సంపాదిస్తేనే వస్తుంది. సంపాదించాలంటే- బిజీ... బిజీ... ఇదీ మావాడి లాజిక్!" మా ముందువరుసలో ఒక పెద్దాయన పక్కవారితో చెబుతున్నాడు. వయస్సు డెబ్బయ్ పైమాటే. భారీ మనిషి. పంచె, లాల్చీ, స్ఫురద్రూపి.

ఆయన పక్క సూట్‌వాలా అంటున్నాడు-

"అవును. మీరు రిటైరయి పదేళ్లయింది. మీకెందుకీ తాపత్రయం అంటారు- నా భార్యా, పిల్లలూ. నేను ఎం.బి.ఏ. క్లాసులు తీసుకుంటాన్లెండి. ఒక వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి మనం. ఇవ్వాల్టి డబ్బు- రేపటికి జీరో. ఇవ్వాల్టి అవసరం రేపటికి రెట్టింపవుతుంది. అట్లాగే ఈనాటి ధరలు రేపటికి నాలుగు రెట్లవుతాయ్. ఈ మూడింటి

ఈక్వేషన్ ఏం చెప్తుంది? చచ్చేవరకూ సంపాదించు కుంటూనే చావాలని గుర్తుచేస్తుంది. యాజ్ సింపుల్ యాజ్ దట్!" అని గొల్లున నవ్వుకున్నాడు. వింటున్నవాళ్ళమంతా విస్తుపోయి చూశాం.

రెండయింది. హాలు పలచగానే ఉంది. ఫోన్‌లేమీ ఫలించడం లేదు.

రామభద్రయ్య పెద్దకొడుకు నాకు దగ్గరగా వచ్చి "మొదలెడదాం అంకుల్. అందరూ బిజీగా ఉన్నామని, సారీ... అంటున్నారు. ఒకరికి వ్యాపారం, ఒకరికి ఉద్యోగం, ఒకరికి ఇతర లావాదేవీలూ, అర్జంట్ పనులూ..." అని వేదిక వైపు కదిలాడు.

వచ్చినవాళ్ళు వచ్చారు. కార్యక్రమం మొదలైంది. పెద్ద హడావిడేం లేదు. క్లుప్తంగా తన జీవితనేపథ్యం చెప్పాడు రామభద్రయ్య. గుమాస్తాగా చేరి మేనేజర్‌గా రిటైరయ్యాడు.

ఆహుతులందరికీ కృతజ్ఞతలు చెప్పారు ఆయన కొడుకులు. భార్యాభర్తలు పూలదండలు మార్చుకున్నారు.

బఫేకి కదిలారు.

బఫే జరుగుతూంటే ఎవరికివారు తోటి పరిచయస్తులతో జట్టుకట్టి మాట్లాడు కుంటున్నారు. ముచ్చట్లలో సైట్‌ల ధరలు, ఇళ్లు, రియల్ ఎస్టేట్‌లూ... ఎవరెవరు ఎంతెంత ఆర్జించారో... ఇవే కబుర్లు.

నేను చూస్తున్నాను. ఆలకిస్తున్నాను. నా పక్కగా మాటలు–

"అయితే మదన్‌మోహన్ షేర్లలో బిజీనా?", "ఆc... ఈ బూమ్‌లో ఒక కోటి లాగించాడంటున్నారు...", "అంత ఉంటుందా..?", "ఏం పాడో, మిత్రులు చెప్పుకోవ డమే!", "ఆయన పని బాగుందయితే. కంప్యూటర్ ముందు కూర్చుని వొళ్ళలవకుండా సంపాదించాడు. మేం చూడండి... అడ్డమైన అవస్థలూ పడి ఫ్లాట్‌లు కట్టిస్తే నిండా పది లక్షలు మిగల్లేదు!"

నాకు నవ్వొచ్చింది. 'పీత కష్టాలు పీతవి!' కన్నమ్మకే వాపి– అన్నట్టుంది– డబ్బు యావ... అనిపించింది.

ఒక్కొక్కరే కదుల్తున్నారు.

శారద కోసం చూశాను. నా పరిస్థితి గమనించి నా దగ్గరకొచ్చింది. సెలవు తీసుకుని బయటపడ్డాం.

ఇంటికొచ్చేసరికి– టైమ్ నాలుగయింది.

పగటి నిద్ర అలవాటు లేదు.

సిటవుట్‌లో కొచ్చి పచార్లు చేస్తున్నాను. నా దృష్టి రోడ్ మీదికి ప్రసరించింది. ఎదురు పేవ్‌మెంట్ మీద పది, పదిహేను గజాల దూరంలో తురాయి చెట్టు.

చెట్టు పక్కగా ఇసుక దిబ్బ. చెట్టుక్రింద ఇసుక దిబ్బ పక్కగా– వయసెంతో తెలియనీయని ముదుసలి స్త్రీ. ముగ్గుబుట్టలాంటి జుట్టు. అనాకారి మొహం. కళ్ళకి పాత కళ్ళజోడు. దారంతో కట్టుకుని చెవులకు దూర్చుకుంది. ఆమె చూపు వచ్చేపోయే జనం మీదే ఉంది.

రోజూ చూస్తున్న దృశ్యమే. ఇవాళెందుకో కొత్తగా ఉంది.

ఆమెకు ఎదురుగా చిన్న చెక్కబల్ల. బల్లమీద నాలుగైదు సీసాలు. వాటిలో జీడీలు, చాక్లెట్‌లూ, పప్పుండలూ, జంతికలూ. సీసాల ప్రక్కగా నాలుగు కీరకాయలు, నాలుగు చిత్తూరు మామిడికాయల ముక్కలూ, ఆ ప్రక్కగా ఒక చాకు. ఇదీ ఆమె దుకాణం. పిల్లలెవరో ఒకరూ, అరా వచ్చి ఏవో కొనుక్కుని పోతున్నారు.

బయటికి వచ్చాను. దుకాణం దగ్గరగా వెళ్ళి నిలబడ్డాను.

అలికిడికి తలతిప్పి నన్ను చూసింది– ఏం కావాలన్నట్టు.

ఆమెను ఏదో అడగాలనిపించింది. ఎలా అడగాలో తెలియడం లేదు. నేను కొనడానికి రాలేదని అర్థమైనట్లుంది... చూపు మరల్చుకుంది.

"ఏం అవ్వా... ఈ బేరాల్లో ఏమొస్తుందీ... ఏం తింటావ్? పొద్దున్నుంచీ కూర్చుని కష్టపడుతున్నావ్?" గొంతు సవరించుకున్నాను.

తలెత్తి నావైపు చూసిందామె. సన్నగా నవ్వుకుంది. క్షణం తర్వాత అంది–

"ఒక్క పొట్టకి ఇంత ముద్దా, కాస్త గంజీ చాలుగదా. అవి వస్తయ్. లక్షలున్నా పంటికింద కొరకటానికెంత కావాలి? పరిగెత్తి, పరిగెత్తీ సంపాదించి, సంపాదించీ ముందు తరాలేం పట్టుకుపోయినై?"

బతికిచెడ్డ మనిషి! సంస్కారవంతురాలిలా మాట!

శతకోటి ప్రశ్నలకు సమాధానమా?

వెన్ను జలదరించింది నాకు. తూలినట్లయి నిలవరించుకున్నాను.

అక్కడ– 'బిజీ' ఘోషలో కొట్టుకుపోతున్న జనసముద్రం.

ఇక్కడ– జీవన వేదాంతాల సారం! తామరాకు మీది నీటిబొట్టు!

ఇసుకదిబ్బ మీద చేయి ఆనిస్తూ కూర్చున్నాను. చేతికి చాలా గులకరాళ్ళు తగిలాయి!!!

'మనిషి మనిషికీ చెప్పాలీ కథ!' అనిపించింది.

●

'కథాకేళి' మాసపత్రిక ... జూన్ ' 2009 సంచికలో ప్రచురితమైన కథ